బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం-6, అక్టోబర్ - 2026

balagamtv100@gmail.com

పేజీలు-8

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి



వివరాలు 2లో..

సచివాలయానికి నిలిచిన మంచినీటి సరఫరా!?



వివరాలు 2లో..

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడీవేడీగా విచారణ



హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి

మిగతా 3లో..

ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం



హైదరాబాద్, అక్టోబర్ 05 : కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న

మిగతా 3లో..

డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి





- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించండి
- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి
- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు డీపీఆర్ వేగవంతం చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందించాలని ఆయన కోరారు. గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న

మిగతా 3లో..

వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

- ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్
- డిసెరోత్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : ఈ ఏడాదికి నోబెల్ పురస్కారాల విజేతల ప్రకటన వైద్య శాస్త్రంతో ప్రారంభమైంది. మెదడు కార్యకలాపాలపై (ఆప్టోజెనెటిక్స్) పరిశోధకులకు వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి వరించింది. మెదడులోని నాదుల కార్యకలాపాలు ప్రారంభం లేదా నిలిపివేత సమయంలో సంభవించే అంతర్గత ప్రక్రియలపై పరిశోధనలకు అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్ (54), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (71), జార్జ్ నాజెల్ (73) అనే శాస్త్రవేత్తలకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు. 'మెదడులోని

మిగతా 3లో..

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత

- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలం
- సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై వివరణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు.

మిగతా 3లో..

ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్



- 4 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిని సునీత
- నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం డిమాండ్

వివరాలు 2లో..

9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

- హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..
- ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక
- అక్టోబరు 9 లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశం

వివరాలు 2లో..

రేవంత్ సర్కార్ కుట్రలు

- వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం
- బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 05 : రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూములలోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్‌లో ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం

మిగతా 3లో..


వణికిస్తున్న అనుమానాస్పద వైరస్



- రష్యా ల్యాబ్‌లో గుర్తుతెలియని ఇన్ఫెక్షన్?
- ఒకరు మృతి.. వందలమంది క్వారంటైన్
- అప్రమత్తమైన అమెరికా, ప్రపంచ దేశాలు!

వివరాలు 4లో..

ఇరాన్-అమెరికా మధ్య సంఘర్షణల వల్లే ఇంధన సంక్షోభం



- కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది
- భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడి

4లో..

యెమెన్ అంతర్యుద్ధం ఉద్ధృతం

- హౌతీల గుప్పిట్లోకి కీలక ప్రాంతాలు..
- తుర్బా నగరం హౌతీలు స్వాధీనం
- మరో సిటీని దక్కించేందుకు యత్నం
- భారీ సైనిక చర్యను ప్రకటించిన యెమెన్

వివరాలు 4లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మహిళలపై నేరాలను అరికట్టండి

- శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి
- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీం కోర్టు కీలక సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

హైదరాబాద్ జైలు నుంచి విజయవాడకు కారుమూరి తరలింపు



హైదరాబాద్, అక్టోబర్ 05 : ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

భారీగా పెరిగిన ఇండిగో విమాన ఛార్జీలు

- అక్టోబర్ 6 నుంచి అమల్లోకి కొత్త ఛార్జీలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : దేశీయ విమాన యాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది. సూతన ఛార్జీల ప్రకారం.. దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375... 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,001-1,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900... 1,501-2,000 కి.మీ. దూరానికి రూ. 1,150... 2,000 కిలోమీటర్ల దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.

ఏసీబీ వలలో మెహదీపట్నం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

- 4 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిణి సునీత
- నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు లంచం డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 05 : మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సునీత రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయింది. నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో వల పన్ని పట్టుకున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అనుచిత లబ్ధి పొందేందుకు యత్నించినందుకుగాను ఆమెపై ఏసీబీ అధికారులు చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిందితురాలిని నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున భద్రతా కారణాల రీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. ఇదే రోజు అంతకుముందు రంగారెడ్డి జిల్లా స్వర్ణ కుమారి ఏసీబీ వలకు చిక్కారు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 2లక్షల లంచం డిమాండ్ చేశారు. అయితే రూ. 2 లక్షల్లో భాగంగా రూ. 1 లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదటగా బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కు అందజేశాడు. ఆ తర్వాత ఆ నగదును డీఎంహెచ్ఓ డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులను కారులో పెట్టేందుకు వెళ్తున్న సమయంలో కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది.

సచివాలయానికి నిలిచిన మంచినీటి సరఫరా!?



హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి మంచినీటి సరఫరా నిలిచిపోయిందంటూ కొన్ని వార్తా ఛానళ్లలో ప్రసారమైన కథనాలపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) స్పందించింది. సచివాలయానికి జలమండలి నుంచి అందించే మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయానికి మంచినీటి సరఫరా నిలిచిపోయిందన్న సమాచారం వెలువడిన వెంటనే జలమండలి అధికారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సచివాలయంలోని మంచినీటి సంపును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో సంపులో నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సచివాలయానికి నీటి సరఫరా నిలిచిపోయిందన్న వార్తల్లో వాస్తవం లేదని జలమండలి స్పష్టం చేసింది. జలమండలి నుంచి సచివాలయానికి రోజువారీగా అందించే మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఎలాంటి సాంకేతిక సమస్య, సరఫరా అంతరాయం లేదని పేర్కొన్నారు. సచివాలయంలోని నీటి సంపును ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలో నీటి నిల్వలు సాధారణ స్థాయిలోనే ఉన్నట్లు తేలడంతో సచివాలయానికి నీటి సరఫరాపై వస్తున్న అనుమానాలకు జలమండలి తెరదించింది. ప్రజలు, సిబ్బంది ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు.

దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు

- బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత కరువు
- బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సంచలన వ్యాఖ్యలు
- సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్
- సరదాగా చేసిన వ్యాఖ్యలని సంజయ్ దత్ వివరణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ "నికార్సయిన నిజం" పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతా భావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు. అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. "ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించినవారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గాంధీగిరి' స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, "దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా" అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.

9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

- హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..
- ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక
- అక్టోబరు 9 లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశం



హైదరాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి



హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో.. ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. జస్టిస్ పి. సామ్ కోషికి సుదీర్ఘ న్యాయ అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన ఆయన.. 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని న్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ప్రాక్టీస్ చేస్తూ దాదాపు 13 ఏళ్ల పాటు న్యాయవాదిగా కొనసాగారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. అనంతరం 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ సామ్ కోషికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వహించారు. ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో మరోసారి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి. సామ్ కోషి బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవం, ప్రభుత్వ న్యాయవాదిగా, డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవం, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా నిర్వహించిన బాధ్యతలు, తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న అనుభవం.. ఇవన్నీ జస్టిస్ సామ్ కోషి న్యాయ ప్రస్థానంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ హైకోర్టు పరిపాలనా వ్యవహారాల్లో ఆయన సుదీర్ఘ న్యాయ అనుభవం కీలకంగా మారనుంది.

ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

- సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా
- బోనస్ పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక ప్రకటన



హైదరాబాద్, అక్టోబర్ 05 : దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్?ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్? రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి అని అన్నారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ముందస్తు దసరా, దీపావళి సుభాకాంక్షలను కిషన్? రెడ్డి తెలియజేశారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి

'చింతన్ శివిర్' --2026 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్?హెచ్?-65, 6ం2 లేన్ల విస్తరణ, ఆర్?ఆర్?ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే అంశాలపై చర్చించారు. హైదరాబాద్--శ్రీశైలం ఎన్?హెచ్?? -765పై ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్‌హెచ్ -65లో ఎల్‌బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు (6ం2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్ఈవాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని నితిన్? గడ్కరీకి కోమటిరెడ్డి వివరించారు. మియాపూర్ -- ఎల్బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్?డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్--నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు.తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్?హెచ్? - 65ను ఆరు(6ం2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఐఎఫ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 511.68 కి.మి. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్ర వ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్.ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి--నర్సాపూర్--తూప్రాన్--గజ్వేల్--జగదేవ్‌పూర్--భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న త్రిబుల్ ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్.హెచ్.ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు.

వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

రహస్యాలను ఛేదిం చడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచ వ్యా ప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తు న్నా రు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదిక గా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలి ఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాల యంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాల యంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు.గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతిని ప్రకటించిన అనంతరం, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ప్రకటిస్తారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, రాయల్ స్వీడిష్ అకాడమీ, నార్వేజియన్ కమిటీలు నోబెల్ బహుమతలను అందజేస్తాయి. ఏటా అక్టోబరు మొదటి వారంలో విజేతలను ప్రకటించి, డిసెంబరు 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున బహుమతులను ప్రధానం చేస్తారు.

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత

"వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

రేవంత్ సర్కార్ కుట్రలు

దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్ల నుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ..



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా కిందికి దిగడం, ఎమర్జెన్సీ కోడ్ పంపడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. 7700 కోడ్‌ను విమాన సిబ్బంది సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఈ కోడ్ వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి విమానానికి ప్రాధాన్య సహాయం అందుతుంది. అయితే అత్యవసర పరిస్థితికి కారణం ఏంటో ఈ కోడ్ ద్వారా తెలియదు. సాంకేతిక సమస్య, ప్రయాణికుడికి వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఇతర కారణాలతోనూ ఈ కోడ్‌ను ఉపయోగించవచ్చు. బీఏ295 ఘటనకు అసలు కారణాన్ని బ్రిటిష్ ఎయిర్‌వేస్ వెంటనే వెల్లడించలేదు. విమానం పరిస్థితి, ఆ తర్వాతి ప్రయాణ మార్గంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో జరిగిన ఘటన తర్వాత మరో విమానం ఎమర్జెన్సీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే బీఏ295 ఘటనకు, ఫ్లైదుబాయ్ ఘటనకు సంబంధం ఉన్నట్లు ప్రస్తుతానికి ఆధారాలు లేవు. సెప్టెంబర్ 30న ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో గొడవ జరిగినట్లు పచ్చిన ఆరోపణల నేపథ్యంలో 7700తో పాటు 7500 కోడ్‌ను కూడా యాక్టివేట్ చేశారు. 7500 కోడ్‌ను విమానంలో చట్టవిరుద్ధ జోక్యం లేదా హైజాక్ పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఆ విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ప్రకటన



హైదరాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్?ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

- ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి
- దొంగ ఓటర్లను తొలగించడమే లక్ష్యం
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 05 : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నా యని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి" అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

మమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు సార్!

- సీఎం ఎదుట గోడు వెళ్లబోసుకున్న యువ రైతు
- కర్ణాటకలో ఓ యువరైతు వింత విజ్ఞప్తి



మైసూరు, అక్టోబర్ 05 : కర్ణాటకలో ఓ యువరైతు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు చేసిన ఓ విజ్ఞప్తి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదని, ఈ తీవ్రమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సంభా షణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైసూరు జిల్లాలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఓ యువరైతు, తమ గోడును నేరుగా డీకే శివకుమార్ ముందుంచారు. "గ్రామాల్లో యువకులకు సొంత ఇళ్లు, పొలాలు ఉండి, కష్టపడి పనిచేస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ జీతం వచ్చే వారినే కోరుకుంటున్నారు. దీంతో 30, 40 ఏళ్లు దాటినా చాలా మంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ మానసిక వేదనతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలు ఇచ్చినట్లే, మా పెళ్లిళ్ల సమస్యను ఆరో గ్యారంటీగా భావించి పరిష్కరించాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు వినతికి డీకే శివకుమార్ మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అతడు చెప్పేది శ్రద్ధగా విన్నారు. సభలో కొందరు నవ్వడంతో, ఇది నవ్వుకోవాల్సిన విషయం కాదని, తీవ్రమైన సామాజిక సమస్య అని వారికి సూచించారు. మారుతున్న సామాజిక ప్రాధాన్యతలు, పట్టణ జీవనశైలి ప్రభావం, ఉద్యోగాల స్వరూపం వంటివి వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వీడియో వైరల్ కావడంతో, వ్యవసాయంపై యువతలో తగ్గుతున్న ఆసక్తి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. మంచి ఆస్తులున్న భూస్వాములకు కూడా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం సీజ్



రూ.1.20 కోట్ల విలువైనదిగా గుర్తింపు

హైదరాబాద్,అక్టోబర్05: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ)అధికారులు భారీగా బంగారం పట్టుకున్నారు. సోమవారం ఓ ప్రయాణికుడి నుంచి సుమారు 800 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.20 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. పక్కా సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. తిరుచ్చిరాపల్లి నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హైదరాబాద్‌కు చెందిన నగల వ్యాపారిగా గుర్తించారు. అతని లగేజీని తనిఖీ చేయగా, అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. తొలుత కస్టమ్స్ అధికారులు సాధారణ తనిఖీల్లో ఈ బంగారాన్ని గుర్తించారు. అనంతరం ప్రయాణికుడిని విచారణ కోసం డీఆర్ఐ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ

హైదరాబాద్, అక్టోబర్ 05 : అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు. ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

మహబూబ్‌నగర్ టూ రాయచూర్ 4 లైన్ల రోడ్డు సిద్ధం

హైదరాబాద్ - పనాజీ కారిడార్‌లో కీలక అడుగు

హైదరాబాద్, అక్టోబర్ 05 : మహబూబ్‌నగర్ టూ రాయచూర్ మార


బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

యెమెన్ అంతర్యుద్ధం ఉద్ధృతం

- హౌతీల గుప్పిట్లోకి కీలక ప్రాంతాలు..
- తుర్బా నగరం హౌతీలు స్వాధీనం
- మరో సిటీని దక్కించేందుకు యత్నం
- భారీ సైనిక చర్యను ప్రకటించిన యెమెన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : యెమెన్‌లో అంతర్యుద్ధం రోజు రోజుకూ ఉద్ధృతమవుతోంది. సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హౌతీ రెబల్స్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జులైలో ముగిసిన తర్వాత పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. హౌతీలపై భారీ సైనిక చర్యను స్థానిక ప్రభుత్వం ప్రకటించగా... దీనికి ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. హూతీలు మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నట్లు ప్రకటించారు. అటు, యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీల స్థావరాలపై విరుచుకుపడుతున్నాయి. మరోవైపు, యెమెన్‌లోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు హౌతీలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక ప్రభుత్వానికి కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే కీలక రహదారిపై తుర్బా ఉంది. తైజ్‌ను హౌతీల నుంచి రక్షించే ప్రభుత్వ బలగాలకు కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. గత నెలఎర్ర సముద్రంలోని పోర్టు సిటీ మోఖా, బాబ్ ఎల్ మండెబ్ జల సంధిని తమ నియంత్రణలోకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా 'డాన్ ఆఫ్ యెమెన్' రిట స్థానిక ప్రభుత్వం భారీ సైనిక చర్యను చేపట్టింది. ఈ క్రమంలోనేబాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై తాము పైచేయి సాధించామని తెలిపింది. తీరప్రాంత పట్టణం ధుబాబ్, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. భారీ నిరసనల కారణంగా మూడు దశాబ్దాలకుపైగా సాగిన అలీ అబ్దుల్లా సలేహ్ పాలనకు 2012లో తెరపడింది. ఆధునిక యెమెన్ చరిత్రలో అత్యంత కీలకమైన రాజకీయ నేతగా సలేహ్ గుర్తింపు పొందారు. 1978 నుంచి 1990 వరకు ఉత్తర యెమెన్ అధ్యక్షుడిగా.. ఆ తర్వాత 2012లో రాజీనామా చేసే వరకు ఉమ్మడి యెమెన్ మొదటి అధ్యక్షుడిగా సేవలందించారు. సమర్థవంతమైన రాజకీయ వ్యూహ చతురతతో గుర్తింపు పొందిన ఆయన.. తన పాలనను 'పాముల పడగలపై డ్యాన్స్ చేయడం'తో పోల్చేవారు. సంక్లిష్టమైన అధికార వ్యవస్థలు, వ్యూహాత్మక పొత్తుల ద్వారా ఆయన మూడు దశాబ్దాలకు పైగా అధికారాన్ని నిలబెట్టుకున్నారు. ఉత్తర, దక్షిణ యెమెన్‌లను విలీనం చేసి 'రిపబ్లిక్ ఆఫ్ యెమెన్' ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించారు. సనా రాజధానిగా, అడెన్ ఆర్థిక రాజధానిగా ఏర్పడిన యెమెన్ రిపబ్లిక్‌కు మొదటి అధ్యక్షుడిగా బాధ్యతలు



చేపట్టారు. 1994లో జరిగిన స్వల్పకాలిక అంతర్యుద్ధంలో దక్షిణ ప్రాంత వేర్పాటువాదుల ప్రయత్నాన్ని తిప్పికొట్టి, సనా కేంద్రంగా తన కేంద్రీకృత అధికారాన్ని బలపరుచుకున్నారు. 2004--2010 ఉత్తర యెమెన్‌లోని సైదీ షియా తిరుగుబాటుదారులైన 'హుతీ'లపై వరుసగా అనేక సైనిక చర్యలను చేపట్టారు. కానీ, 2011లో 'అరబ్ స్ప్రింగ్' ఉద్యమంతో యెమెన్‌లో తిరుగుబాటు మొదలైంది. సలేహ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో 2012 ప్రారంభంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ మన్సూర్ హాదీకి అధికారాన్ని బదిలీ చేసి, ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరతను ఆసరాగా చేసుకుని ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు పుంజుకున్నారు. 2014--2015 మధ్య అనూహ్యంగా హుతీలు, అబ్దుల్లా సలేహ్ మధ్య వ్యూహాత్మక పొత్తు కుదిరింది. ఈ కూటమి మన్సూర్ హాదీ ప్రభుత్వం నుంచి సనా నగరాన్ని స్వాధీనం చేసుకుంది. చివరకు హాదీని అధికారంలోంచి దింపేశారు. అయితే, హౌతీలతో సలేహ్ కటీఫ్ చెప్పి సౌదీ అరేబియాతో ఒప్పందం చేసుకున్నారు. సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి.. యెమెన్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించడానికి, దక్షిణ సరిహద్దులో ఇరాన్ ప్రభావాన్ని నిరోధించడానికి 2015 మార్చిలో వైమానిక, భూతల దాడులను ప్రారంభించింది. దీంతో ఆగ్రహించిన హౌతీలు.. 2017లో సనాలోని సలేహ్ ఇంటిని చుట్టుముట్టి హతమార్చాయి.హూతీలు, ప్రభుత్వం మధ్య ప్రత్యక్ష పోరాటంతో పాటు వ్యాధులు, ఆకలి కారణంగా 3,77,000 మందికి పైగా మరణించారు. ఇది ప్రపంచంలోని అత్యంత ఘోరమైన మానవతా విపత్తులలో ఒకటిగా నిలిచింది. అలాగే, మరో 45 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులుగా మిగిలిపోయారు. ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ధ్వంసం కావడం వల్ల భారీ స్థాయిలో కలరా వ్యాప్తి చెందింది. పోషకాహార లోపం విస్తృతంగా వ్యాపించింది. దీంతో 80% కంటే ఎక్కువ జనాభా మానవతా సహాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

అమరావతి, అక్టోబర్ 05 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

- రష్యా ల్యాబ్‌లో గుర్తుతెలియని ఇన్ఫెక్షన్?
- ఒకరు మృతి.. వందలమంది క్వారంటైన్
- అప్రమత్తమైన అమెరికా, ప్రపంచ దేశాలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : షాలో కొత్త ఇన్?ఫెక్షన్? భయాలు చెలరేగాయి. సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్? టెక్నీషియన్? తెలియని ఇన్ఫెక్షన్?తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్?లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్?ఫెక్షన్?/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్?ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్?మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. సైబీరియాలోని యాంటీ-ప్లేగ్? పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్? తెలియని ఇన్?ఫెక్షన్?తో మరణించారు. ఇర్కుట్స్క్? సమీపంలోని షెలెఖోవ్?లో ఉన్న యాంటీ-ప్లేగ్? రీసెర్చ్? ఇన్?స్టిట్యూట్?లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోత్రెబ్నాడ్జోర్? దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమెనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్?ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్? , షెలెఖోవ్? నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోత్రెబ్నాడ్జోర్? పేర్కొంది. ఏది ఏమైనపప్పటికీ, ల్యాబ్? ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్?ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్? సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్? ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్? వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్? పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్? గవర్నర్? ఇగోర్





కోబ్జెన్? మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్?ఫెక్షన్? ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్? మాట్లాడుతూ, ఈ ఇన్?ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్? టెక్నీషియన్?తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు.

ఇరాన్-అమెరికా మధ్య సంఘర్షణల వల్లే

ఇంధన సంక్షోభం



- కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది
- భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. బ్యారెల్‌కు 100 డాలర్లను మించి ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరలపై పడుతోంది. ఇప్పటికే ప్రైవేట్ ఇంధన సరఫరా సంస్థ నయారా ఎనర్జీ ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. దీంతో రానున్న రోజుల్లో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు కూడా ఇంధన ధరలను పెంచుతాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు ధరలు 100 డాలర్లను దాటినప్పుడు పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని చెప్పలేమని వ్యాఖ్యానించారు. ఇరాన్-అమెరికా మధ్య సంఘర్షణల ప్రభావం వల్లే ఇంధన సంక్షోభం నెలకొందని అన్నారు. "క్రూడ్ ఆయిల్ ధరలు అస్థిరతతో కొనసాగుతున్నాయి. చమురు ధరలలో భారీ పెరుగుదల మార్కెట్ అనిశ్చితికి ప్రతిబింబంగా చెప్పవచ్చు. కొనసాగుతున్న సంఘర్షణల మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చాలా దూరంలో ఉంది. బ్యారెల్‌కు 100 డాలర్ల కంటే ఎక్కువ ముడి చమురు ధరలు సూచిస్తున్నాయి. ధరలు ఇంకా సాధారణ స్థితికి రాలేదు. ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణ ప్రభావాన్ని కేవలం ఆర్థిక కోణం లోనే చూడకూడదు. ఇంధన సరఫరాకు అంత రాయం వల్ల సామాన్య కుటుంబాలు, ఉపాధి, జీవనోపాధిపై ప్రత్యక్షంగాప్రభావం పడుతుం ది.మనకు ఏమాత్రం సంబంధం లేని సంఘర్ష ణల వల్ల మూల్యం చెల్లిస్తున్నాం. ఇంధనం, వాణిజ్య రాక పోకలను పునరుద్ధరించాలని భారతదేశం కోరుతుంది" అని జైశంకర్ పేర్కొ న్నారు. ఈ పరిస్థితి నుండి వెలువడే ఎలాంటి ఫలితమైనా అంతర్జాతీయ చట్టాలకు అనుగు ణంగా ఉంటుందనిజైశంకర్ నొక్కి చెప్పారు. ప్రపంచ ఇంధనమార్కెట్లు, అంతర్జాతీయ వాణి జ్యంపై ఇరాన్ సంఘర్షణ విస్తృత ప్రభావంపై ఆందోళనలు తీవ్రమవు తున్న నేపథ్యంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యా ఖ్యలు ఇప్పుడు చర్చనీయాం శంగా మారాయి. కాగా ఇంధన ధరలపై పెరుగుదలపై వాహన దారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పెట్రోల్, డీజిల్ పెరుగుదల రవాణ రంగంపై పడుతోం ది. రవాణ ఖర్చులు పెరగడం వల్ల నిత్యావస రుకులధరలుకూడా పెరుగుతున్నాయి. ఇది సామాన్యులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు శుభవార్త

919 ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు

హైదరాబాద్, అక్టోబర్ 05 : ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రవేశపెట్టిన 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్?' కింద సేవల కల్పన క్రమంగా ఊపందుకుంటోంది. ఈ పథకాన్ని నిర్వహించే 'ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్' (ఈహెచ్‌సీటీ) ప్రస్తుతం 919 ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వానికి నివేదించింది. జులై 17న పథకం ప్రారంభమైనప్పటి నుంచి సాధించిన పురోగతిని వివరిస్తూ ట్రస్ట్ ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ పథకం కింద 919 ఆసుపత్రులు నమోదయ్యాయి. 15,395 చికిత్సలకు గానూ రూ.104.63 కోట్ల విలువైన ముందస్తు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో 778 ప్రైవేట్, 141 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి పోలీస్ శాఖను కూడా ఈ పథకంలో చేర్చారు. ఉద్యోగులు, పింఛనుదారుల చందాల ద్వారా నెలకు మొత్తం రూ.44 కోట్లు సమకూరుతుండగా ప్రభుత్వం అదనంగా మరో రూ.44 కోట్లను సమకూరుస్తోంది. దీంతో ఈహెచ్?ఎస్ కోసం ప్రతి నెలా రూ.88 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ పథకం వార్షిక బడ్జెట్ రూ.1,056 కోట్లుగా అంచనా వేశారు. ఇది ఇన్‌పేషెంట్ అవుట్‌పేషెంట్ సేవలను అందిస్తోంది. వెల్‌నెస్ సెంటర్లలో వైద్యుల సంప్రదింపులు, రోగ నిర్ధరణ పరీక్షలు, మందులు నగదు రహితంగా అందిస్తారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ సెంటర్లు పనిచేస్తున్నాయి. మరో 25 కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో 21 వివిధ జిల్లాల్లోనూ, నాలుగు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నారు. ఇన్‌పేషెంట్ వైద్య సేవల కోసం మొత్తం 1,816 సీజీహెచ్ఎస్ చికిత్స ప్యాకేజీలు అమలు చేస్తున్నారు. హెల్త్ కార్డులు ఇంకా జారీ కాలేదన్న కారణంతో అర్హులైన వారికి వైద్య సేవలను నిరాకరించకూడదని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగులు, పింఛనుదారులు తమ గుర్తింపు సంఖ్యలను ఉపయోగించి వైద్య సేవలను పొందవచ్చు.

సర్కారీ బడి కోసం రూ. 3.5 కోట్లకు పైగా విరాళాలు!

- ప్రైవేట్ స్కూళ్లకు పోటీగా ప్రభుత్వ బడులు
- అధునాతన రీతిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 511'

హైదరాబాద్, అక్టోబర్ 05 : ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అధునాతన రీతిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 511' చేస్తున్న కృషికి హైదరాబాద్ దాతలు అండగా నిలిచారు. హైదరాబాద్ రౌండ్ టేబుల్ 8 ఛారిటబుల్ ట్రస్ట్స్ నేతృత్వంలో నిర్వహించిన 9వ 'ఫుడ్ ఫర్ ఛేంజ్' ఫండ్‌రైజింగ్ గాలా ఈవెంట్ అత్యంత వైభవంగా ముగిసింది. జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, నూతన స్టార్టప్ నిర్వాహకులు, సామాజిక వేత్తలు, దాతలు పాల్గొని విరాళాలు అందించారు. ఈ నిధుల సేకరణ కార్యక్రమం ద్వారా రూ.3.5 కోట్లకు పైగా విరాళాలు వసూలయ్యాయి. హైదరాబాద్‌లోని



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఉన్న గౌళిదొడ్డి ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలను రూ. 7.75 కోట్ల అంచనా వ్యయంతో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఈ విరాళాలను వినియోగించనున్నారు. ఈ నూతన మోడల్ క్యాంపస్ ద్వారా సుమారు 840 మంది విద్యార్థులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నూతనంగా రూపుదిద్దుకోనున్న గౌళిదొడ్డి ప్రభుత్వ పాఠశాల క్యాంపస్‌లో 20 మోడల్ తరగతి గదులు, అత్యాధునిక లైబ్రరీ, సైన్స్ మరియు కంప్యూటర్ లాబొరేటరీలు, విశాలమైన డైనింగ్ హాల్, కిచెన్, యాంఫీ థియేటర్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఫుట్‌బాల్ కోర్ట్ మరియు ఆహ్లాదకరమైన కోర్ట్‌యార్డ్‌లు నిర్మించనున్నారు. ఇది విద్యార్థులకు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాల్లో కూడా రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ నిధుల సేకరణ సాయంత్రంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీ.వీ. ఆనంద్; ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సలహాదారు కే. రామకృష్ణారావు, ఐఏఎస్; ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్; ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, ఐఏఎస్; టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్; మరియు ఇంధన శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఐఏఎస్‌లతో పాటు పలువురు కార్పొరేట్ దిగ్గజాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 'ప్రాజెక్ట్ 511' గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ హన్స్‌న్ చాస్ మాట్లాడుతూ.. "సమాజానికి తిరిగి ఇచ్చే క్రమంలో హైదరాబాద్ ఎప్పుడూ ముందుంటుంది. పిల్లల భవిష్యత్తు కోసం దాతలు చూపుతున్న నిబద్ధతకు 'ఫుడ్ ఫర్ ఛేంజ్' ఒక నిదర్శనం. గౌళిదొడ్డి క్యాంపస్ ప్రాజెక్ట్ మా సంస్థ చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటి. ఒక మంచి ఆశయం కోసం సమాజమంతా ఏకమైనప్పుడు ఏదీ అసాధ్యం కాదని రూ. 3.5 కోట్లకు పైగా వచ్చిన విరాళాలు నిరూపించాయి" అని హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా విద్యా రంగానికి సేవలు: 2003వ సంవత్సరంలో హైదరాబాద్ రౌండ్ టేబుల్ 8 ద్వారా ప్రారంభమైన 'ప్రాజెక్ట్ 511' గత 23 ఏళ్లుగా తెలంగాణవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని 1,319 ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఇది నేరుగా లబ్ధి చేకూర్చింది. 142 నూతన తరగతి గదులు, 797 పరిశుభ్రమైన టాయిలెట్ బ్లాక్‌లు, 310 సైన్స్ ల్యాబ్‌లు, 30,834 డ్యూయల్ డెస్క్‌లు (బెంచీలు), 718 టీచింగ్ కిట్‌లను ఈ సంస్థ పాఠశాలలకు అందించింది. అంతేకాకుండా తరగతి గదుల డిజిటలైజేషన్, స్కూల్ ఫర్నిషింగ్, ఇంగ్లీష్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తోంది. గౌళిదొడ్డి మోడల్ స్కూల్ నిర్మాణంలో భాగస్వామ్యమై విరాళాలు అందించాలనుకునే వారు వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వంతు సహకారాన్ని అందించవచ్చని నిర్వాహకులు కోరారు.

పంటను కాపాడుకునేందుకు రైతు తపన..

- నీళ్లు లేక ఎండిపోతున్న పంట
- వాటర్ ట్యాంకర్‌తో పొలానికి నీరు.. పంటను బతికించుకుంటున్న రైతు అజ్మీర లింబ నాయక్.
- కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు... నీటి కష్టాలు.. అంటూ రైతు ఆవేదన

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

నీళ్లు లేక వరి పంట ఎండిపోతుండటంతో ఆ పంటను ఎలాగైనా కాపాడుకోవాలన్న తపనతో ఓ రైతు వినూత్న ప్రయత్నం చేస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వర తండాకు చెందిన రైతు అజ్మీర లింబ నాయక్ తన వరి పొలానికి సాగునీరు అందక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకొచ్చి పొలంలోకి వదులుతున్నారు.

ప్రస్తుతం పొలంలో వరి పంట ఏపుగా పెరిగినప్పటికీ, అవసరమైన సమయంలో నీరు అందకపోవడంతో పంటపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. దీంతో పంటపై పెట్టిన పెట్టుబడి వృథా కాకుండా, కష్టపడి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు రైతు స్వయంగా వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకుని పొలానికి నీటిని అందిస్తున్నారు.

ఒక్కో నీటి చుక్క కోసం రైతు పడుతున్న కష్టం ఈ దృశ్యం చూస్తే అర్థమవుతోంది. సాధారణంగా సాగునీటి వనరులపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు, నీటి కొరత ఎదురైనప్పుడు ఎంతటి ఇబ్బందులు పడాల్సి వస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడితే రైతు పడే ఆవేదన మరింత తీవ్రంగా



ఉంటుంది.

వరి సాగుకు కీలకమైన సమయంలో నీరు అందకపోవడంతో పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ నీటిపై ఆధారపడాల్సి వస్తోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంటను కాపాడుకోవాలన్న పట్టుదలతో ఖర్చుకు వెనుకాడకుండా నీటిని తెప్పించి పొలానికి అందిస్తున్నాడు.

రైతుల పంటలకు సాగునీరు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అవసరమైన సహకారం అందించాలని స్థానిక తులు కోరుతున్నారు.

పంట ఎండిపోకుండా.. పెట్టిన పెట్టుబడి వృథా కాకుండా.. చేతికొచ్చే పంటను కాపాడుకునేందుకు రైతు చేస్తున్న ఈ ప్రయత్నం అన్నదాత కష్టాలకు అద్దం పడుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కరెంటు కష్టాలతో పాటు నీటి కష్టాలు కూడా ఎదురవుతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల కాలనీకి మౌలిక వసతులు కల్పిస్తాం



-జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధి..
-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ,వేములవాడ:

వేములవాడలో నూతనంగా ఏర్పడుతున్న జర్నలిస్టుల కాలనీకి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వేములవాడ పట్టణంలో జర్నలిస్టుల నివాస గృహాల సముదాయాన్ని సందర్శించిన నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల కాలనీలో తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు తదితర సదుపాయాలను కల్పిస్తామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి మూడు బోర్లు వేయాలని సూచించగా, వెంటనే బోర్లు వేసి మోటార్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు, వీధి దీపాలు బిగించేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. బోర్లకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, స్ట్రీట్ లైట్లకు అవసరమైన విద్యుత్ సదుపాయాలను త్వరితగతిన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు కిలోమీటర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉచితంగా అందించే విధానం అమల్లోకి వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సరళీకృత నిర్ణయాలతో విద్యుత్ సదుపాయం సులభతరమైందన్నారు. ఇప్పటికే ఎన్‌పీడీసీఎల్ పరిధిలో సుమారు 2,800 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినామని, జర్నలిస్టుల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు కూడా ఈ సదుపాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు వనమహోత్సవం నిర్వహించాలని సూచించారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సమీపంలో, గుట్ట ప్రాంతం పక్కన ప్రకృతి రమణీయ వాతావరణంలో ఉన్న ఈ కాలనీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టుల రంగానికి దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టుల గౌరవం, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాలనీ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బిల్లుల కోసం పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి..

ఇందిరమ్మ ఇంటి బిల్లులు విడుదల చేయాలని బాధితురాలి ఆవేదన

బలగం టీవీ,వీర్నపల్లి:

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి రావడం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో కలకలం రేపింది.గోన్యా నాయక్ తండాకు చెందిన బట్టు రోజా మాన్య నాయక్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణంలో భాగంగా ప్రారంభంలో బేస్‌మెంట్ బిల్లు రెండుసార్లు డిపాజిట్ కావడంతో అధికారులు బిల్లును హోల్డ్‌లో పెట్టినట్లు తెలిపారు. అనంతరం ఇంటి గోడలు, స్లాబ్ నిర్మాణం పూర్తయినా తదుపరి బిల్లులు ఇప్పటివరకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లుల కోసం కలెక్టరేట్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

ఈ క్రమంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందు డబ్బాతో వచ్చినవారు తనకు రావాల్సిన ఇంటి నిర్మాణ బిల్లులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరుతూ నిరసన తెలిపారు.



కరెంట్ లేక.. కళ్లముందే ఎండుతున్న పంట..



నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతుల ధర్నా..
-రైతుల ఫోన్లకు ఏఈ స్పందనేదీ...

బలగం టీవీ, గంభీరావుపేట :

గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో విద్యుత్ కోతలు, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామంలోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు ధర్నా నిర్వహించారు, సంఘటన స్థలానికి ఎస్సై శ్రీకాంత్, ఏఈ ఆనంద్ చేరుకొని రైతులతో మాట్లాడి నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ

పంటలు పొట్ట దశలో ఉన్న సమయంలో విద్యుత్ కోతల కారణంగా వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో అరగంట విద్యుత్ సరఫరా అవుతుండగానే మళ్లీ అరగంట నుంచి రెండు గంటల వరకు కోత విధిస్తున్నారని తెలిపారు. దీంతో పొలాల్లో కొంత భాగానికి మాత్రమే నీరు అందుతుండగా, మిగిలిన పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున ఈ సమయంలో నీరు అత్యవసరమని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో నాణ్యత లేకపోవడంతో మోటార్లు సరిగా పనిచేయడం లేదని, పలువురి వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ సమస్యలపై ఏఈకి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇటీవల తమ ప్రాంతంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరారు. రైతులు ఫోన్ చేస్తున్నది ఇబ్బంది పెట్టేందుకు కాదని, తమ పంటలను కాపాడుకునేందుకేనని పేర్కొన్నారు. గ్రామస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు రైతుల సమస్యలపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్నందున విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని రైతులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మల్లు పల్లె సర్పంచ్ సత్యం, రాజేశ్వరరావు కాలనీ సర్పంచ్ పిట్ల బాబు,నాయకులు రాజిరెడ్డి,కొమిరిశెట్టి లక్ష్మణ్, భాస్కర్, నర్సింలు, అంజిరెడ్డి, రాజారాం, రమేష్, ఎల్లం పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇండియన్ కరెన్సీపై అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలి..

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్

బలగం టీవీ, వేములవాడ:



భారతీయ కరెన్సీ నోట్లపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జింక శ్రీధర్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా గొప్ప ఆర్థికవేత్తగా కూడా దేశానికి విశేషమైన సేవలు అందించారని అన్నారు. భారత కరెన్సీ వ్యవస్థపై ఆయన చేసిన లోతైన అధ్యయనానికి నిదర్శనంగా "ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ – ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్" అనే గ్రంథాన్ని 1923లో రచించారని తెలిపారు. భారత కరెన్సీ, ద్రవ్య వ్యవస్థకు సంబంధించిన అంబేద్కర్ ఆలోచనలు అనంతరం హిల్టన్ యంగ్ కమిషన్గా పిలువబడిన రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ ముందు ఆయన సమర్పించిన అభిప్రాయాలతో చర్చకు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కమిషన్ 1926లో భారతదేశానికి కేంద్ర బ్యాంకు అవసరాన్ని సిఫారసు చేయగా, తదనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లో ఆమోదం పొంది, 1935 ఏప్రిల్ 1న ఆర్‌బీఐ కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపారు.

అంబేద్కర్ రచించిన "ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ" భారత ద్రవ్య వ్యవస్థపై ముఖ్యమైన ఆర్థిక అధ్యయనంగా గుర్తింపు పొందిందని, ఆర్‌బీఐ భావన రూపుదిద్దుకునే ప్రక్రియలో ఆయన ఆర్థిక ఆలోచనలు, కమిషన్ ముందు ఆయన ఇచ్చిన సాక్ష్యం ముఖ్యమైన పాత్ర పోషించాయని జింక శ్రీధర్ అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఇంతటి మేధోపరమైన కృషి చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు కరెన్సీపై కూడా తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక సమానత్వం మరియు రాజ్యాంగ విలువలను అందించిన మహనీయుడి చిత్రాన్ని భారతీయ కరెన్సీ నోట్లపై ముద్రించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని జింక శ్రీధర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు, సామాజిక న్యాయం, రాజ్యాంగ సేవలను దేశవ్యాప్తంగా మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

బలగం టీవీ, వేములవాడ :

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలు వేములవాడ జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా పోటీలు కొనసాగుతుండగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి పరిశీలించి.. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులు పాల్గొనడం పై జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. ఇక్కడ హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, జిల్లా విద్యాధికారి మొండయ్య, డీవైఎస్ఓ రాందాస్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



7 లీటర్ల ఐడి లిక్కర్ స్వాధీనం

ఐదు దాడులు ,ఆరు కేసులు

ముగ్గురి అరెస్ట్ 300 లీటర్ల ఏఫ్ జే వాష్ ను సంఘటన స్థలంలోనే ధ్వంసం

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండ్ ఆదేశాల మేరకు ఏసీ మేడం పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం సోమవారం సిరిసిల్ల ఏసి ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో కలిసి కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తండా అజ్మీర తండా హనుమ తండా గోవిందరావుపేట తండా బోసాయిపేట తండా ప్రాంతాలలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో నిమ్మ పెల్లి తండా గోవిందరావుపేట తండా ప్రాంతాల్లో మొత్తం మూడు ఐడి కేసులు గుర్తించడం జరిగిందన్నారు ఈ కేసులకు సంబంధించిన నిమ్మపల్లి తండా కు చెందిన ఎస్లావత్ రవి ఎస్లావత్ దేవవ్వ గోవిందరావుపేట తండా కు చెందిన గుగులోత్ సరోజ లను అరెస్ట్ చేసి ఏడు లీటర్ల ఐడి లిక్కర్ను సంఘటన స్థలంలోనే ధ్వంసం చేసుకోవడం జరిగిందన్నారు అదేవిధంగా 300 లీ. ఎఫ్.జి వాష్ను సంఘటన స్థలంలో నే ధ్వంసం చేయడం జరిగిందన్నారు ఈ దాడుల్లో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్హెచ్ఓ విజయేందర్ రెండ్ల ఎన్ఫోర్స్మెంట్ టీం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ బాల్రెడ్డి కానిస్టేబుల్ రవీందర్ సిద్ధిరాములు కర్ణాకర్ డిటిఎఫ్ కానిస్టేబుల్ మనోహర్ శ్రీవాణి పాల్గొన్నారు

రైతన్నలకు కరెంటు కోతలు.. సాగునీటి కొరత..

- మల్కాపేట రిజర్వాయర్‌లో నీరు నింపి రైతులకు సాగునీరు అందించాలి..
- పంటలు ఎండిపోకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి:
బీజేపీ నేత సింగరవేణి కృష్ణహరి

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సింగరవేణి కృష్ణహరి ఆరోపించారు. ఒకవైపు మల్కాపేట రిజర్వాయర్‌కు అందాల్సిన నీరు అందకపోవడం, మరోవైపు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆయన పేర్కొన్నారు.

మల్కాపేట రిజర్వాయర్‌లో తగినంత నీటిని నిల్వ చేసి ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వాయర్‌లో నీరు అందుబాటులో లేకపోవడం వల్ల ఇప్పటికే సాగు చేసిన పంటలకు నీటి సమస్య ఏర్పడుతోందని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు.

విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి..

వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్న రైతులకు విద్యుత్ సరఫరా కీలకమని, అయితే విద్యుత్ కోతల కారణంగా పొలాలకు సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని కృష్ణహరి అన్నారు. ముఖ్యంగా బుగ్గ రాజేశ్వర తండా, అల్మాస్పూర్, రాజన్నపేట, తిమ్మాపూర్ తదితర ప్రాంతాల్లో రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, చివరి దశలో నీరు, విద్యుత్ అందక పంటలు దెబ్బతింటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

మల్కాపేట రిజర్వాయర్‌లో వెంటనే నీటి నిల్వ చేయాలి..

మల్కాపేట రిజర్వాయర్‌లో సాధ్యమైనంత త్వరగా నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణహరి కోరారు. రిజర్వాయర్‌కు నీరు అందితే పరిసర ప్రాంతాల్లోని అనేక మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

రైతుల పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి అవసరమైన సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతన్నలను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు కొనసాగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతుల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రైతుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని, సాగునీరు, విద్యుత్ అందించి రైతుల పంటలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సింగరవేణి కృష్ణహరి పేర్కొన్నారు.

దొంగతుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

మండల సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి

బలగం టీవీ, ధర్మారం



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని దొంగతుర్తి మండల సాధన సమితి నాయకులు మూదాం శ్రావణ్, గొట్టే లింగయ్య అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీరాములుకు మండల ఏర్పాటు కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏడాది క్రితం దొంగతుర్తి మండల సాధన సమితి ఆధ్వర్యంలో మండల ఏర్పాటుకు అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. దొంగతుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టి ఇప్పటికే అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.దొంగతుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి, మండల ఏర్పాటుకు సహకరించాలని అదనపు కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు.



సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్..

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఐడీఓసీ ప్రజావాణికి మొత్తం 115 అర్జీలు రాగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక అర్జీ, వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో మూడు అర్జీలు వచ్చాయి. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మండలాల వారీగా బోయినపల్లి, చందుర్తి మండలాల్లో రెండేసి, ఇల్లంతకుంటలో 3, గంభీరావుపేటలో 6, కోనరావుపేటలో 6, ముస్తాబాద్‌లో 7, తంగళ్లపల్లిలో 4, వీర్నపల్లిలో 2, వేములవాడ అర్బన్‌లో 3, వేములవాడ రూరల్‌లో 7, ఎల్లారెడ్డిపేటలో ఒక దరఖాస్తు వచ్చాయి. రుద్రంగి మండలంలో ఎలాంటి దరఖాస్తులు రాలేదు.

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. స్థానికంగా తమ సమస్యలపై అర్జీలను ఆయా కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపుతున్నట్లు తెలిపారు.ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు అన్యాయం..

- MRPS జగిత్యాల జిల్లా సీనియర్ నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం

బలగం టీవీ, కథలాపూర్:

వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలంలో ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో మాదిగ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని MRPS జిల్లా సీనియర్ నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం ఆరోపించారు. భూషణరావుపేట, సిరికొండ, గంభీరావుపేట సొసైటీల పాలకవర్గాలతో పాటు కాంగ్రెస్ మండల కమిటీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవుల విషయంలోనూ మాదిగలకు ఒక్క పదవి కూడా దక్కకపోవడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో, జిల్లాలో, నియోజకవర్గంలో, మండల స్థాయిలో మాదిగల జనాభా గణనీయంగా ఉందని, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని లక్ష్మీరాజం అన్నారు. ఎన్నికల సమయంలో మాదిగల ఓట్లు కోరుతూ, పదవుల పంపకంలో మాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగ సోదరులు ఈ అంశంపై స్పందించి చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కథలాపూర్ మండలంలోని మాదిగలు ఐక్యంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కాశవత్తుల లక్ష్మీరాజం స్పష్టం చేశారు. మాదిగలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తెలిపారు.



ప్రత్యేక పోలీస్ స్టేషన్ల మంజూరుపై కృతజ్ఞతలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ.. ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు ద్వారా మహిళల భద్రతకు మరింత భరోసా కలుగుతుందని, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుతో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ పోలీస్ స్టేషన్లు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి గతంలో సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు మ్యాకల పర్శరాములు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గడ్డం నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు బిళ్ల వెంకట్రాములు, జిల్లా ప్రధాన మహిళా కార్యదర్శి త్రివేణి, వేములవాడ టౌన్ మహిళా అధ్యక్షురాలు అఖిల, వేములవాడ టౌన్ ఉపాధ్యక్షురాలు మమత, మహేష్ యాదవ్, తంగాలపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఎగుర్ల కనకరాజు, చందుర్తి మండల యువజన విభాగం అధ్యక్షులు కత్తి రమేష్, మ్యాక అజయ్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన వేములవాడ జూనియర్ కళాశాల మైదానం..

- రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సందడిగా 'క్యాంప్ ఫైర్' వేడుకలు..

- తీన్మార్ డప్పుల సప్పుడు.. ఆటపాటలతో చిందులేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు..

- ఆనందోత్సాహాల నడుమ తెలంగాణ జానపద నృత్యాలు చేసిన కబడ్డీ క్రీడాకారులు..

బలగం టీవీ, వేములవాడ:

తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రాంగణమైన వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఆదివారం రాత్ ఉత్సాహపూరిత వాతావరణంతో మార్మోగింది. పోటీల్లో భాగంగా నిర్వహించిన క్యాంప్ ఫైర్, సాంస్కృతిక వేడుకలు క్రీడాకారులతో పాటు హాజరైన ప్రజలను విశేషంగా అలరించాయి.





బెల్ట్ షాపుల బారిన పల్లెలు.. పట్టించుకునేదెవరు?

అర్ధరాత్రి దాటినా యథేచ్ఛగా మద్యం విక్రయాలు..

అధిక ధరలతో మందుబాబులపై అదనపు భారం..

తండాలపై దాడులు కాదు.. గ్రామాల్లోని అనధికారిక బెల్ట్ షాపులపైనా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్..

యువత, పేద కుటుంబాల ఆరోగ్యంపై ప్రభావం..

ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లోనూ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మద్యం అందుబాటులో ఉండటంతో యువత, కార్మికులు, నిరుపేద కుటుంబాలపై దాని ప్రభావం పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లోనూ విక్రయాలా?

మండల కేంద్రంలో కొన్ని బెల్ట్ షాపులు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? జరిగితే వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై అధికారులు పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ వినిపిస్తోంది.బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఎంఆర్‌పీకి మించి.. అదనపు వసూళ్ల ఆరోపణలు..

గ్రామాల్లోని అనధికారిక మద్యం విక్రయ కేంద్రాల వద్ద ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మద్యం బాటిళ్లపై ప్రత్యేక స్టిక్కర్లు అంటించి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ అనుమతితో నడిచే మద్యం దుకాణాల నుంచి బయటకు వెళ్లే మద్యం బెల్ట్ షాపులకు ఎలా చేరుతోంది? దాని ధరలు ఎవరు నిర్ణయిస్తున్నారు? బాటిళ్లపై అదనపు స్టిక్కర్లు ఎవరు వేస్తున్నారు? అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

బెల్ట్ షాపు.. గ్రామానికి మరో సమస్య?

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో కొంతమంది యువకులు, పురుషులు మద్యం సేవనానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అందుబాటులో ఉండటం వల్ల అలవాటు పెరుగుతోందన్నది వారి ఆందోళన.

మద్యం కొనుగోలు కోసం కుటుంబ ఆదాయంలో అధిక భాగం ఖర్చు కావడం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు మద్యపానం ఒక కారణంగా మారుతోందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు.

తండాల్లో దాడులు.. బెల్ట్ షాపులపై ఎందుకు మౌనం?

ఇదే సమయంలో గిరిజన తండాల్లో సంప్రదాయంగా ఇంటి అవసరాల కోసం తయారు చేసుకునే సారా విషయంలో ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహిస్తున్న తీరుపై కొన్ని గిరిజన సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



తమ వాదన ప్రకారం, తండాల్లో దాడులు నిర్వహించే ముందు గ్రామాల్లో బహిరంగంగా లేదా అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలి. గిరిజనులపై మాత్రమే నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారనే భావన కలగకుండా, నిబంధనలు ఉల్లంఘించే ప్రతి ఒక్కరిపైనా ఒకే విధమైన చర్యలు ఉండాలని వారు కోరుతున్నారు.

అయితే సారా తయారీ, విక్రయాలకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు వేరుగా ఉన్నందున, సంప్రదాయం పేరుతో నిషేధిత మద్యం తయారీకి మినహాయింపు ఇవ్వాలన్నది కాకుండా, చట్ట అమలులో సమానత్వం పాటించాలన్నదే గిరిజన సంఘాల ప్రధాన డిమాండ్‌గా వారు చెబుతున్నారు.

నకిలీ మద్యం.. కల్తీ మద్యం ఆరోపణలపై దృష్టి సారించాలి..

మద్యం దుకాణాలు, అనధికారిక విక్రయ కేంద్రాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతపై కూడా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారిక తనిఖీల ద్వారానే తేలాలని అంటున్నారు.

మద్యం బాటిళ్ల బ్యాచ్ నంబర్లు, సీల్, లేబుల్, ధర, సరఫరా వివరాలు తదితర అంశాలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు అంటున్నారు.

ఎక్సైజ్ శాఖపై మరో కీలక ప్రశ్న..

గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో అధికారులకు తెలియదా? తెలిసి ఉంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అనధికారికంగా మద్యం విక్రయించే కేంద్రాలకు మద్యం సరఫరా అవుతున్న మార్గం ఏమిటి? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం వెళ్తున్నట్లయితే ఆ సరఫరా గొలుసును గుర్తించడం ఎవరి బాధ్యత? అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిపై తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది? అనే ప్రశ్నలకు సమాధానం అవసరమని స్థానికులు అంటున్నారు.

అధికారుల కింది స్థాయి సిబ్బంది విధుల నిర్వహణపై కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని, ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉందనే ఆరోపణలు ఉంటే వాటిపై అంతర్గతంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం.. అధికారులు.. ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన సమయం..

ఇది కేవలం మద్యం విక్రయాల సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, యువత భవిష్యత్తు, చట్ట అమలు వంటి అనేక అంశాలతో ముడిపడిన సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం మద్యం విక్రయాలపై విధించిన నిబంధనలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. ఎక్సైజ్ అధికారులు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి అనధికారిక బెల్ట్ షాపులను గుర్తించాలి. అధిక ధరల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించాలి. నకిలీ, కల్తీ మద్యం ఆరోపణలపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలి.

అన్ని పార్టీల నేతలు కూడా స్పందించాలి..

ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు వంటి అంశాలపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

బెల్ట్ షాపులు ఎవరి ఆధ్వర్యంలో ఉన్నా.. ఏ పార్టీకి చెందిన వారి అండ ఉన్నా.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంపై రాజకీయ నాయకులు అధికారులను ప్రశ్నించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఒకే ప్రశ్న.. నిబంధనలు అందరికీ సమానమేనా?

తండాల్లో నిబంధనల అమలుకు అధికారులు వెళ్లడం అవసరమే అయితే, అదే సమయంలో గ్రామాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపులపై కూడా చర్యలు ఉండాలి.

చట్టం అందరికీ సమానమైతే.. చర్యలు కూడా అందరిపైనా సమానంగా ఉండాలి.

బెల్ట్ షాపులు నిజంగా ఎక్కడెక్కడ కొనసాగుతున్నాయి? వాటికి మద్యం ఎలా చేరుతోంది? ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా? మద్యం నాణ్యతను ఎవరు తనిఖీ చేస్తున్నారు? రాత్రి వేళల్లో విక్రయాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

తండాలపై దాడులు మాత్రమే కాదు.. గ్రామాల్లోని అనధికారిక బెల్ట్ షాపులపైనా సమాన దృష్టి సారించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడటం, నిబంధనలను అమలు చేయడం, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.

ఎల్లారెడ్డిపేట మండల ప్రజలు ఇప్పుడు అధికారుల నుంచి కోరుతున్నది ఒక్కటే—బెల్ట్ షాపులపై సమగ్ర తనిఖీలు.. నిబంధనల ఉల్లంఘనలపై పారదర్శక చర్యలు.. మద్యం విక్రయాలపై కఠిన పర్యవేక్షణ. ప్రజల ప్రశ్నలకు అధికారుల సమాధానం ఏమిటో వేచి చూడాలి.

కులగణనలో ప్రత్యేక బీసీ కాలమ్ చేర్చాలి..

- విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పైగా పెంచాలి..

– జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ నరేష్ గడ్డం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను కచ్చితంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనలో ప్రత్యేకంగా బీసీ కాలమ్‌ను చేర్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ నరేష్ గడ్డం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గతంలో 2011లో కులగణన జరిగిందని, ప్రస్తుతం బీసీల జనాభా, వారి సామాజిక పరిస్థితులపై సమగ్రంగా, శాస్త్రీయంగా వివరాలు సేకరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇప్పటికైనా కులగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి గణాంకాలను సేకరించాలని కోరారు. ప్రస్తుత అవకాశాన్ని కోల్పోతే భవిష్యత్తులో మరోసారి ఇలాంటి సమగ్ర గణన కోసం దీర్ఘకాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

దేశ రాజకీయ వ్యవస్థలో బీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం దక్కడం లేదని నరేష్ గడ్డం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

అదేవిధంగా, బీపీ మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా అమలులోకి వచ్చిన 27 శాతం బీసీ రిజర్వేషన్లను కాలానుగుణంగా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో బీసీ జనాభా పెరగడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో పోటీ కూడా పెరిగిందని, అందువల్ల బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పైగా పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, కులగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని నరేష్ గడ్డం కోరారు. “బీసీలు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను సాధించుకోవాలి. జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం” అని ఆయన అన్నారు.

బీసీల వెనుకబాటుతనానికి కాంగ్రెస్ బిఆర్ఎస్ బిజెపి లే

- అక్టోబర్ 9 న ఆదిలాబాద్ లో బహుజన రాజ్యాధికార సంకల్ప సభ ను విజయవంతం చేయండి..

- బీఎస్పీ చీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం.

బలగం టీవీ, సిరిసిల్ల:

దేశంలో మెజారిటీగా ఉన్న బీసీల వెనుకబాటుతనానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల విధానాలే కారణమని బీఎస్పీ చీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆరోపించారు. అక్టోబర్ 9న ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు సిరిసిల్ల జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిషాని రామచంద్రం మాట్లాడారు. బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు సంబంధించిన గోడపత్రికను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిషాని రామచంద్రం మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లు బీసీలను అన్ని రంగాల్లో వెనక్కి నెట్టాయి అని ఆవేదన వ్యక్తంచేశారు. విద్య ఉద్యోగ రాజకీయాల్లో తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రాజ్యాంగం అమలు అయిన నుండి నలబై మూడు ఏండ్ల పాటు బిసి లకు ఏ రంగం లో కూడ రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్ర చేసిన మనువాద పార్టీ లు అన్నారు. మాన్యవర్ కాన్షీరామ్ పోరాటం వల్ల మండల్ కమీషన్ అమలు అయ్యిందని తద్వారా బీసీలకు రిజర్వేషన్లు అందాయని అన్నారు. రాజకీయాల్లో సమాన అవకాశాలు ఇవ్వకుండా కేవలం ఓటు బ్యాంకు గా మాత్రమే వాడుకున్నారు అన్నారు. అందుకే మాన్యశ్రీ కాన్షీరాం బిఎస్పీ ని పెట్టి జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇచ్చారని అన్నారు. కనీసం పంచాయితీ కి కూడ ఎన్నిక కానీ బిసిలను చట్టసభలకు పంపిన నాయకుడు కాన్షీరామ్ అని అన్నారు. ఈ జిల్లా లో అన్ని పార్టీ లు బిసిలకు చేనేత లకు అన్యాయం చేస్తున్నాయి అని అన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు వలస పోతున్నారు అని అన్నారు.

రానున్న ఎన్నికల్లో బీసీలను చట్టసభల్లోకి పంపాలనే లక్ష్యంతో బీఎస్పీ పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ లను రాజకీయంగా సమాధి చేయలని పిలుపునిచ్చారు. నేరెళ్ల దళితులకు బీఆర్ఎస్ అన్యాయం చేస్తే, కాంగ్రెస్ బిజెపి లు వారిని రాజకీయంగా వాడుకొని వారు అధికారం లోకి వచ్చాక కూడ వారికి న్యాయం జరుగలేదని అన్నారు. బీఎస్పీ ద్వార మాత్రమే సమాజం లో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసి మెంబర్ ఎనగందుల వెంకన్న జోన్ ఇంచార్జి దొడ్డే సమ్మయ్య జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ , ప్రధాన కార్యదర్శి లింగంపల్లి మహేష్, జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, జిల్లా కోశాధికారి అబ్దుల్ నబీ, సిరిసిల్ల అసెంబ్లీ ఇంచార్జి బోగ కనుకయ్య, వేములవాడ అసెంబ్లీ ఇంచార్జి దొబ్బల రాము, వేములవాడ అసెంబ్లీ అధ్యక్షులు కట్కూరి శంకర్, మహిళ నాయకురాలు బూర మమత, సెక్టారు అధ్యక్షులు బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీలో భారీగా యువకుల చేరిక..



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలో గల బొప్పాపూర్ గ్రామంలో ఆదివారం భారీ సంఖ్యలో నియోజకవర్గ యువజన నాయకుడు సయ్యద్ జావిద్, మండల నాయకుడు బొమ్మన వేని పరుశరాములు ఆధ్వర్యంలో 50 మంది యువకులు, మహిళలు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరడం జరిగింది.

ఈ సందర్భంగా టిఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ మజీద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ కవితక్క ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడం జరుగుతుందన్నారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు కవితక్క రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ వాటి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని కవితక్క ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని తాము టిఆర్ఎస్ పార్టీలో చేరడం ఆనందంగా ఉందని యువకులు చెప్పడం అభినందనీయమన్నారు. కవితక్క ముఖ్యమంత్రి అయితే. తెలంగాణలో పాంచ జన్యం ద్వారా ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి–ఉద్యోగ కల్పన, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పాటుపడడానికి కవితక్క పార్టీని ఆవిర్భవించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, రైతులు, మహిళలు, యువతకు అవకాశాలు కల్పిస్తూ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కవితక్క ఆదేశాల మేరకు పనిచేస్తామని మజీద్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ మహిళా ఇన్చార్జ్ కదిరే రేణుక, బొమ్మనవేణి పద్మ, ఎల్లారెడ్డిపేట ముస్తాబాద్ మండల ఇన్చార్జులు కదిరే భాస్కర్, మార్వాడి దేవరాజు, సీనియర్ నాయకులు ఆల్లె శంకర్, బండెల రాజు, చరణ్, సిద్దు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి..



-80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి
-రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం,

80ఫీట్ల రోడ్డు నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయం తదితర నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సోమవారం వివరించగా, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమీక్షించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని సూచించారు. ప్రస్తుత భక్తుల రద్దీ, భవిష్యత్తులో రద్దీకి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఒక్కో పనికి గడువు విధిస్తూ వాటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని, నిధులు మంజూరు చేస్తున్నారని, పనుల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు.

రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగం విస్తరించేలా ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం పనులు చేయిస్తుందని పేర్కొన్నారు. సమ్మక్క సారక్క ఆలయానికి భక్తులు నిరంతరం వెళ్లేలా అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందని స్పష్టం చేశారు. అధికారులు అన్ని పనులు నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని, 80 ఫీట్ల రోడ్డును పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు పూర్తి చేసే అవకాశం రావడం అదృష్టమని, దీనిలో అధికారులు పూర్తిస్థాయిలో భాగస్వాములై పూర్తి చేయాలని సూచించారు.

శ్రీ విధుశేఖర భారతి స్వామి, సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ విస్తరణ పనులను చేయాలని ఆదేశించారు.అధికారులందరూ ఈ పనులు తమవిగా భావించి పూర్తిస్థాయిలో నిమగ్నమై వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. జిల్లాలోని కార్మిక, ధార్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు .

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రతి వారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. వాటిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేస్తున్నామని అన్నారు . ప్రతి అధికారి తన బాధ్యతల కాలంలో ఆలయ నిర్మాణం పనుల్లో భాగస్వామ్యులు కావడం ఎప్పటికీ గుర్తు ఉండిపోతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఈఈ భీమ్లానాయక్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎం శ్రీనివాస్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీటీఏడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్.

డ్రైవర్, యజమానిపై కేసు నమోదు.
ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్.



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదిర గ్రామం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి డ్రైవర్ ఉరడి రామచంద్రం (35), తండ్రి మల్లయ్య, నాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ట్రాక్టర్ యజమాని పట్టెల రవి ఆదేశాల మేరకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. దీంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ ఉరడి రామచంద్రంతో పాటు ట్రాక్టర్ యజమాని పట్టెల రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్. రమేష్ హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

వీర్నపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

-రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల హరీష్



బలగం టీవీ,వీర్నపల్లి:

వీర్నపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, వర్షాభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ .మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో వరి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. పెట్టుబడులు పెట్టిన రైతులకు పంటలు చేతికందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎండిపోయిన పంటలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించాలని కోరారు. రైతుల నష్టాలను పరిగణనలోకి తీసుకుని వీర్నపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



రెండు సబ్ స్టేషన్ లు మంజూరు పట్ల హర్షం..


బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని పధిర బండ లింగంపల్లి గ్రామాలకు రెండు సబ్ స్టేషన్లు మంజూరు చేసినందుకు ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ లింగంపల్లి గ్రామంలో 2 కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణం అవుతుందన్నారు. అలాగే పధిర హరిదాస్ నగర్ గ్రామాలకు 3 కోట్ల 14 లక్షల రూపాయలతో సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తారని అన్నారు. ఈ రెండు సబ్ స్టేషన్ ల నిర్మాణాలతో మండలంలో లో వోల్టేజ్ సమస్య తీరుతుందని అన్నారు. మంజూరి కి సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య నాయకులు గుండాటి రామ్ రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, ఎస్.కె సాహెబ్, నంది కిషన్, మండే శ్రీనివాస్, లింగం గౌడ్, శ్రీనివాస్ నారాయణ, రాములు, మూర్తి వెంకటేష్, వంగ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, నంతోష్, పోచయ్య, శ్రీనివాస్, నరేందర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ లో ధరల పట్టిక ప్రకారం బిల్లులు చెల్లించి రశీదు పొందాలి..

- రశీదు ఇవ్వకుంటే పిర్యాదు చేయండి.. మీసేవ నిర్వహాకులపై చర్యలు తీసుకుంటాం..
- రాజన్న సిరిసిల్ల జిల్లా మీసేవ సెంటర్ల ఈడిఎం శ్రీనివాస్



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

మీసేవ సెంటర్లలలో ధరల పట్టిక ప్రకారం ప్రజలు బిల్లులు చెల్లించి రశీదు పొందాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మీసేవ సెంటర్ల ఈడిఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని విశ్వం మీసేవ సెంటర్ ను ఈడిఎం శ్రీనివాస్, డిఎం మహష్ లు కలిసి రికార్డులను పరిశీలించారు.

విశ్వం మీసేవ కేంద్రంలో ఇటీవల జరిగిన ఘటనపై ఆపరేటర్ ను తొలగించామని కొత్త ఆపరేటర్ ను నియమించి ఆపరేటర్ కు ఓనర్ మల్లేశం లకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినందున పోలీసుల దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

అనంతరం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా లో 92 మీ సేవ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు, జిల్లాలోని మీ సేవ నిర్వహాకులు ధరల పట్టిక ప్రకారమే చార్జీలు తీసుకోవాలని అదనంగా చార్జీలు వసూళ్ళు చేస్తే ఆదారాలతో తమకు ఫిర్యాదు చేయండి.. వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల అవసరాన్ని బట్టి మీసేవ సెంటర్ల ఖాళీలను లోకల్ వారికి ప్రాదాన్యత ఇస్తూ ఇంటర్వూల ద్వారా భర్తీ చేస్తున్నమన్నారు.

చిన్న పిల్లల ఆదార్ కార్డుల విషయంలో మీ సేవ నిర్వహాకులకు ఏలాంటి చార్జీలు ఇవ్వకూడదని ఆయన చెప్పారు.

మౌనిక మృతికి సంతాపం..

- శంకర్ కుటుంబానికి అండగా టీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు..



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముక్క శంకర్ భార్య మౌనిక అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మౌనిక భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి, జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముక్క శంకర్‌ను పరామర్శించిన నాయకులు ఆయనకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో శంకర్ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సిటీ లక్ష్మణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, దుమాల మాజీ ఎంపీటీసీ కమ్మర్ శంకర్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎమ్మార్పీఎస్ నాయకులు కానాపురం లక్ష్మణ్ మాదిగ, గద్దరాసి భగవంతన్న మాదిగ, బి. రాజేష్ మాదిగ, ముక్క దేవయ్య మాదిగ, ముక్క శ్రీనివాస్ మాదిగ, దరువు రమేష్ మాదిగ, సాగర్ మాదిగ, సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడల్లో భారత్‌కు 4వ స్థానం

85 పతకాలతో ముగిసిన ఆసియాడ్ ప్రచారం
21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో నాలుగో స్థానంలో నిలిచిన భారత్
గత ఎడిషన్ (106 పతకాలు) తో పోలిస్తే తగ్గినా.. టీమ్ ఈవెంట్లలో, కొత్త విభాగాల్లో మెరిసిన క్రీడాకారులు



బలగం టీవీ, నగేయా/హైదరాబాద్

ఆసియా ఖండాన్ని హోరెత్తించిన ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ హంగామా ముగిసింది. ఈ టోర్నీలో భారత్ మరోసారి ప్రశంసనీయ ప్రదర్శన చేస్తూ పతకాల పట్టికలో టాప్-4లో నిలిచింది. మొత్తం 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో కలిపి 85 పతకాలను సొంతం చేసుకుంది. ముగింపు దశలో (చివరి రెండు రోజుల్లో) ఏకంగా 11 స్వర్ణాలు సాధించడంతో నాలుగో స్థానం ఖరారైంది.

చైనా 169 గోల్డ్ సహా మొత్తం 341 మెడల్స్‌తో అగ్రస్థానంలో నిలవగా, ఆతిథ్య జపాన్ (83 స్వర్ణాలు, 269 పతకాలు) రెండో స్థానంలో, దక్షిణ కొరియా (39 స్వర్ణాలు, 150 పతకాలు) మూడో స్థానంలో నిలిచాయి.

తగ్గిన పతకాల సంఖ్య – పెరిగిన పోటీ:

2023 హాంగ్జౌ ఆసియాడ్‌లో 28 స్వర్ణాలు సహా rekord స్థాయిలో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. గతంలో గెలిచిన 28 స్వర్ణాల్లో కేవలం 8 మాత్రమే నిలబెట్టుకోగలిగింది. గాయాల కారణంగా నీరజ్ చోప్రా దూరమవ్వడం, మను భాకర్ వంటి కీలక షూటర్లు తడబడటం, అథ్లెటిక్స్, షూటింగ్, టెన్నిస్‌లో ఆశించిన పతకాలు రాకపోవడం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

అయితే అదే సమయంలో 13 కొత్త విభాగాల్లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా అవతరించడం భవిష్యత్తుపై కొత్త ఆశలు రేపుతోంది.

టీమ్ ఈవెంట్లు, ఆర్చరీ, బాక్సింగ్‌లో ఊరట:



టీమ్ ఈవెంట్లు: క్రికెట్, హాకీ, కబడ్డీ పురుషుల మరియు మహిళల జట్లు అద్భుత ప్రదర్శన చేస్తూ ఏకంగా 6 స్వర్ణాలను అందించాయి.

ఆర్చరీ & బాక్సింగ్: ఆర్చర్లు 5 స్వర్ణాలు సహా 9 పతకాలు సాధించగా, రికర్వ్‌లో 17 ఏళ్ల కుంకుమ్, గోల్ఫ్‌లో ప్రణవి చరిత్ర సృష్టించారు. బాక్సింగ్‌లో లవ్లీనా, పర్వీన్, అంకుష్, రెజ్లింగ్‌లో సుజీత్, అమన్ సెహ్రావత్ పసిడి పతకాలతో మెరిశారు.

మెరిసిన తెలంగాణ కిరణాలు:

జపాన్ గడ్డపై తెలంగాణ క్రీడాకారులు తమ ముద్ర వేశారు. పెద్దపల్లికి చెందిన ఆర్చర్ తానిపర్తి చికిత మహిళల టీమ్, మిక్స్ టీమ్ ఈవెంట్లలో రెండు స్వర్ణాలు గెలిచి ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. పిస్టల్ షూటర్ ఇషా సింగ్ 25 మీటర్ల పిస్టల్ విభాగంలో రజతం సాధించి భారత్‌కు గర్వకారణంగా నిలిచింది.

పరిశీలన – భవిష్యత్తు ప్రణాళిక:

2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై కన్నేసిన భారత్‌కు ఈ ఆసియాడ్ ఫలితాలు ఒక హెచ్చరిక లాంటివి. స్టార్ ఆటగాళ్లపైనే ఆధారపడకుండా క్రీడా సైన్స్, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం, గాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఈ టోర్నీ స్పష్టం చేస్తోంది.

డబ్ల్యూసీఎల్ నుంచి పాకిస్తాన్ లెజెండ్స్ ఔట్

ఎన్ఓసీ ఇవ్వని పీసీబీ.. బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లు రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

క్రికెట్ దిగ్గజాల మధ్య జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీ నుంచి పాకిస్తాన్ లెజెండ్స్ జట్టు వైదొలిగింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) ఇవ్వకపోవడంతో షాహిద్ అఫ్రిది సారథ్యంలోని పాకిస్తాన్ లెజెండ్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే టోర్నీ నుంచి తప్పుకుంది. దీంతో బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా లెజెండ్స్‌తో జరగాల్సిన ఆ జట్టు మ్యాచ్‌లు రద్దయ్యాయి. ఈ విషయాన్ని పాకిస్తాన్ లెజెండ్స్ జట్టు మేనేజ్‌మెంట్ ప్రకటన ద్వారా వెల్లడించింది. ఎన్ఓసీ ఇవ్వడానికి పీసీబీ నిరాకరించడంతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నామని, పీసీబీ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని పేర్కొంది. తమ ఆటగాళ్లు టోర్నీలో ఆడలేకపోవడం బాధాకరమని, అభిమానుల మద్దతుకు కృతజ్ఞతలు తెలిపింది.జాతీయ మీడియా కథనాల ప్రకారం.. టోర్నీలో పాల్గొనేందుకు పీసీబీ కొన్ని షరతులు విధించినట్లు తెలుస్తోంది. గత ఎడిషన్‌లో భారత్ తమతో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన నేపథ్యంలో భారత జట్టు లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పాలని పీసీబీ డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ డిమాండ్‌ను డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు అంగీకరించకపోవడంతో పాకిస్తాన్ లెజెండ్స్ జట్టు టోర్నీ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది.పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో గత ఎడిషన్‌లో పాకిస్తాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌లను యువరాజ్ సింగ్ సారథ్యంలోని ఇండియా ఛాంపియన్స్ ఆడేందుకు నిరాకరించింది. లీగ్ మ్యాచ్‌తో పాటు సెమీఫైనల్‌కు కూడా దూరంగా ఉండటంతో భారత్ ఫైనల్‌కు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

జూబ్లీహిల్స్‌లో '7పాడెల్ ఎమ్ఎస్ ధోని' స్పోర్ట్స్ అండ్ వెల్నెస్ సెంటర్ ప్రారంభం



క్రికెట్ లెజెండ్ ఎంఎస్ ధోని చేతుల మీదుగా ప్రారంభోత్సవం
వ్యాయామం, రికవరీ, క్రీడల సమాహారంగా 15 వేల చదరపు అడుగుల విలాసవంతమైన సెంటర్

బలగం టీవీ, హైద

క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోని సోమవారం నగరంలోని జూబ్లీహిల్స్‌లో '7పాడెల్ ఎమ్ఎస్ ధోని' (7Padel MS Dhoni) ఇండోర్ స్పోర్ట్స్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను వైభవంగా ప్రారంభించారు. పాడెల్ పార్క్ ఇండియా సహ వ్యవస్థాపకులు నిఖిల్ సచ్‌దేవ్, జిగర్ దోషి, ప్రతీక్ దోషిలతో కలిసి ఆయన ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సుమారు 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అధునాతన సెంటర్‌లో మూడు ప్రత్యేక పాడెల్ కోర్టులు, సంపూర్ణ పరికరాలతో కూడిన జిమ్, సౌనా, ఐస్ బాత్, ఇన్‌ఫ్రారెడ్ రూమ్‌లతో కూడిన రికవరీ సూట్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు యోగా, పిలాటేస్ శిక్షణ కోసం ప్రత్యేక స్టూడియో, కేఫ్, ప్రేక్షకుల కోసం వ్యూయింగ్ గ్యాలరీని తీర్చిదిద్దారు. బిగినర్స్ నుండి నిపుణుల వరకు అందరికీ అవసరమైన క్రీడా పరికరాలు, ధృవీకృత కోచ్‌ల శిక్షణ, స్థానిక టోర్నమెంట్లను ఇక్కడ నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా ఎంఎస్ ధోని మాట్లాడుతూ.. "దేశంలో ఏ క్రీడ విస్తరించాలన్నా దానికి ఎలాంటి షార్ట్‌కట్లు ఉండవు. నాణ్యమైన కోర్టులు, క్రీడాకారులకు అనుకూలమైన వసతులు, క్షేత్రస్థాయి భాగస్వామ్యమే ముఖ్యం. నగరాల వారీగా పాడెల్ క్రీడ అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్‌లో ఈ నూతన అధ్యాయం ప్రారంభం కావడం సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.

పాడెల్ పార్క్ ఇండియా కో-ఫౌండర్ జిగర్ దోషి మాట్లాడుతూ.. ఫిట్‌నెస్‌తో పాటు సామాజిక సంబంధాలను పెంపొందించే క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో హైదరాబాద్‌లో ఈ సెంటర్ ప్రారంభించడం సరైన నిర్ణయమని తెలిపారు. ప్రస్తుతం ముంబై, పూణే, బెంగళూరు, చెన్నై, ఢిల్లీల్లో 50కి పైగా కోర్టుల ద్వారా 55,000 మందికి పైగా క్రీడాకారుల నెట్‌వర్క్ ఉందన్నారు. రాబోయే రోజుల్లో కొచ్చి, కోయంబత్తూర్, జైపూర్ వంటి నగరాలకు విస్తరించి, 2027 నాటికి దేశవ్యాప్తంగా 500కు పైగా కోర్టులను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

గ్లోబల్ ఫ్రాంచైజీ లీగ్‌పై ఐసీసీ వెనకడుగు

ఛాంపియన్స్ లీగ్ తరహా టోర్నీ ప్రతిపాదనను తిరస్కరించిన బీసీసీఐ, ఈసీబీ, క్రికెట్ ఆస్ట్రేలియా
2031 వరకు కొత్త టోర్నీలు లేవని తేల్చిచెప్పిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్

బలగం టీవీ, దుబాయ్ / లండన్

సాకర్ క్లబ్ వరల్డ్ కప్, ఫుట్‌బాల్ ఛాంపియన్స్ లీగ్ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో 'గ్లోబల్ ఫ్రాంచైజీ టీ20 టోర్నీ'ని నిర్వహించాలన్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రణాళికలకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత శక్తివంతమైన 'బిగ్ 3' దేశాలైన భారత్ (బీసీసీఐ), ఆస్ట్రేలియా (సీఏ), ఇంగ్లండ్ (ఈసీబీ) క్రికెట్ బోర్డులు ఐసీసీ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించాయి.

ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐపీఎల్, బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) వంటి సొంత ఫ్రాంచైజీ లీగ్‌లతో క్రికెట్ క్యాలెండర్ ఇప్పటికే కిక్కిరిసిపోయిందని బోర్డులు వ్యాఖ్యానించాయి. అదనపు టోర్నీలను చేర్చడం వల్ల ఆటగాళ్లకు ఏమాత్రం విశ్రాంతి లభించదని, ఇది వారి ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేశాయి. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉన్న వన్డే వరల్డ్ కప్ లేదా ఛాంపియన్స్ ట్రోఫీల వ్యవధిని కుదిస్తేనే కొత్త టోర్నీ గురించి ఆలోచిస్తామని నిబంధన విధించాయి.

ఆదాయం కోసం చూసిన ఐసీసీ..

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల క్రికెట్ బోర్డులు ఫ్రాంచైజీ లీగ్స్ ద్వారా వందల కోట్ల డాలర్లు ఆర్జిస్తున్నప్పటికీ, వాటి ద్వారా ఐసీసీకి ఎలాంటి రాబడి లభించడం లేదు. రాబోయే మీడియా హక్కుల విభాగంలోనూ ఆదాయం తగ్గే సూచనలు కనిపిస్తుండటంతో, కొత్త ఆదాయ వనరుగా ఈ గ్లోబల్ లీగ్‌తో పాటు నాలుగు దేశాల టీ20 టోర్నీని తెరపైకి తెచ్చేందుకు ఐసీసీ ప్రయత్నించింది.

2031 వరకు పాత షెడ్యూలే అమలు:

బిగ్ 3 బోర్డుల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురవ్వడంతో ఐసీసీ తన ప్రతిపాదనల నుంచి పూర్తిగా వెనక్కి తగ్గింది. 2031 వరకు ఎలాంటి గ్లోబల్ ఫ్రాంచైజీ టోర్నీలను నిర్వహించబోమని ఐసీసీ స్పష్టం చేసినట్లు బ్రిటీష్ దినపత్రిక 'ది గార్డియన్' వెల్లడించింది. దీనితో 2027 నుంచి 2031 వరకు ముందస్తు ప్రణాళిక ప్రకారమే అంతర్జాతీయ షెడ్యూల్ కొనసాగనుంది. ఇందులో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పరిధిని మాత్రమే కొంత విస్తరించనున్నారు. ఈ పరిణామంతో అంతర్జాతీయ క్రికెట్‌లో 'బిగ్ 3' ప్రాబల్యం మరొకసారి రుజువైంది.

నాకు ఎవరూ ఏ గిఫ్ట్ ఇవ్వలేదు



ఐటీ సోదాల నేపథ్యంలో తన పేరును ప్రస్తావించడంపై హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందించారు. ఆ సోదాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. వాస్తవాలు తెలుసుకుని మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె అన్నారు. ఈ మేరకు ఇన్?స్టాగ్రామ్?లో సుదీర్ఘమైన స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు. ఇటీవల జరిగిన ఐటీ సోదాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపారు. 'నాది ఆర్మీ నేపథ్యం ఉన్న కుటుంబం. నేను ఎంతో కష్ట పడి ఈ స్థాయికి వచ్చాను. బాధ్యతాయుత పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే టాక్స్ కడుతున్నాను. వ్యక్తిగతంగా గానీ, ఏ ఇతర నిర్మాణ సంస్థ తరఫున గాని నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీల్లో పాలుపంచుకోలేదు. దేశ విదేశాల్లో ఎవరి పేరు మీద నాకు బినామీ ఆస్తులు లేవు. నాకు ఎవరూ ఎలాంటి ఆస్తులను గిఫ్ట్?గా ఇవ్వలేదు. అలాంటి కాస్ట్?లీ గిఫ్ట్?లను ఎవరైనా ఇచ్చినా సరే తీసుకోకూడదన్నది నా నియమం' అని రకుల్ ప్రీత్?సింగ్ తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కాగా, గతనెల 29న ముంబయిలో ఆమె మామ, నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే ఆ సోదాలను తనకు లింక్? చేస్తుండడంపై ఆమె తాజాగా స్పందించడం ప్రస్తుతం హాట్ టాపిక్?గా మారింది.తెలుగుతో పాటు పలు భాషల్లో వరుస సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్, నిర్మాత జాకీ భగ్నానీని 2024లో వివాహం చేసుకున్నారు. జాకీ భగ్నానీ ప్రముఖ నిర్మాత వాసు భగ్నానీ కుమారుడు. ఇక వాసు భగ్నానీ బాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందారు. ఆయన కుటుంబానికి చెందిన పూజా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ ద్వారా ఎన్నో సినిమాలు నిర్మించారు. 'హీరో నంబర్ 1', 'బీవీ నంబర్ 1', 'బడే మియా ఛోటే మియా', 'రెహ్నా హై తేరే దిల్ మే' వంటి చిత్రాల నిర్మాణంలో ఆయన భాగస్వామిగా ఉన్నారు. పనోరమా స్టూడియోస్? సంస్థ హిందీ చిత్ర పరిశ్రమలో నిర్మాణం, పంపిణీ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అజయ్ దేవగణ్ నటించిన 'దృశ్యం' చిత్రాలతో పాటు 'రైడ్', 'మిషన్ రాణిగంజ్' వంటి సినిమాలతో ఆ సంస్థకు సంబంధం ఉంది. ఇటీవల అధికారులు సంస్థకు సంబంధించిన ఆర్థిక పత్రాలు, ప్రాజెక్టులకు వచ్చిన నిధులు, ఖర్చులు, విదేశీ లావాదేవీల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే ఏయే లావాదేవీలపై అనుమానాలు ఉన్నాయనే విషయాన్ని మాత్రం అధికారులు ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు.

అక్టోబర్ 15న 'జైలర్ 2'





సూపర్‌స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'జైలర్ 2' సినిమా మరో పది రోజుల్లో థియేటర్లలోకి రానుంది. రజనీకాంత్ కథానాయకుడిగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న మూవీ ఇది. బ్లాక్ బస్టర్ 'జైలర్' సీక్వెల్ గా రూపొందుతోంది. దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ను లాంచ్ చేశారు.'జైలర్' కథ ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే 'జైలర్ 2' కథ ప్రారంభం అవుతుంది. మొదటి భాగానికి మించి ఉండేలా, భారీ స్థాయిలో స్టార్ కాస్టింగ్ తో ఈ సీక్వెల్ రూపొందించారు. ఇందులో టైగర్ ముత్తువేల్ పాండియన్ గా రజనీకాంత్ తిరిగొచ్చారు. ఆయన భార్యగా రమ్యకృష్ణ, కోడలిగా మిర్నా కనిపించారు. మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్జే సూర్య, సూరజ్ వెంజరమూడు, అన్నా రాజన్, యోగిబాబు, జతిన్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, జాకీ ష్రాఫ్ స్పెషల్ క్యామియో రోల్స్ చేశారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ భారీ బడ్జెట్ తో 'జైలర్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం సమకూర్చగా.. విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. నిర్మల్ ఎడిటింగ్ చేశారు. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది.

చేతులెత్తి వేడుకుంటున్నా.. నా పేరు వాడొద్దు

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ పేరు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా ఆయనకు రాజకీయంగా కీలక పదవి దక్కబోతోందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై బండ్ల గణేష్ తాజాగా స్పందించారు. తన పేరు ఉపయోగించి లేనిపోని ప్రచారాలు చేయొద్దని, వాటి వల్ల తన వ్యక్తిగత జీవితానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి పదవులు, హోదాలపై ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తాజాగా ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. బండ్ల గణేష్ తన పోస్టులో.. 'దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను' అంటూ విజ్ఞప్తి చేశారు. తనకు ఎలాంటి పదవులు, హోదాల మీద వ్యామోహం కానీ, ఆశ కానీ లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు.. లేనిపోని విషయాలు మాట్లాడి తన పేరును ఉపయోగించడం ద్వారా తనకు ఇబ్బందులు కలిగించొద్దని కోరారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని, తన పేరు ఉపయోగించకుండా తనకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని మరోసారి చేతులెత్తి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. సాధారణంగా తనదైన శైలిలో ఘాటుగా స్పందించే బండ్ల గణేష్ ఈసారి చాలా సున్నితంగా, భావోద్వేగంతో విజ్ఞప్తి చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇటీవల బండ్ల గణేష్‌కు రాజకీయంగా ఏదైనా కీలక పదవి దక్కబోతోందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ప్రచారంపై ఆయన ఇప్పటివరకు నేరుగా స్పందించలేదు. తాజా పోస్టులో మాత్రం తనకు ఎలాంటి పదవులు, హోదాలపై ఆసక్తి లేదని ప్రత్యేకంగా చెప్పడంతో.. ఈ వ్యాఖ్యలు రాజకీయ పదవుల ప్రచారాన్ని ఉద్దేశించే చేశారా? అనే చర్చ మొదలైంది. అయితే బండ్ల గణేష్ తన పోస్టులో ఎవరినీ, ఏ ప్రచారాన్ని నేరుగా ప్రస్తావించలేదు. బండ్ల గణేష్ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. తనకు ఆత్మీయులైన వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడంతో పాటు, తనను టార్గెట్ చేసే వారికి కూడా కౌంటర్లు ఇస్తున్నారు. 'నా మౌనాన్ని బలహీనత అనుకోవద్దు.. సమయం కోసం ఆగుతున్నాను' అంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో ఆసక్తి రేపారు. అలాగే కష్టాలు, పట్టుదల, నిజాయితీ, విజయం గురించి వరుస పోస్టులు చేస్తూ తనదైన శైలిలో స్పందించారు. అయితే, ఇప్పుడు మాత్రం పూర్తిగా భిన్న ధోరణిలో తన పేరు ఉపయోగించవద్దని చేతులెత్తి వేడుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజా పోస్టు చూసిన కొందరు నెటిజన్లు 'బండ్లన్నా.. ఏమైంది?' అంటూ ప్రశ్నిస్తున్నారు. మరికొందరు ఆయనకు మద్దతుగా స్పందిస్తున్నారు. ఇంకొందరు మాత్రం గతంలో ఆయన చేసిన ఘాటు పోస్టులను గుర్తు చేస్తూ కామెంట్లు చేస్తున్నారు. దీంతో బండ్ల గణేష్ తాజా పోస్ట్‌పై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి. ఇటీవల తన కుమార్తె వివాహం సందర్భంగా కూడా బండ్ల గణేష్ వార్తల్లో నిలిచారు. ఆ తర్వాత పబ్లిక్ ఈవెంట్లలో పెద్దగా కనిపించకపోయినా సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గానే ఉన్నారు. తనకు నచ్చిన విషయాలపై స్పందిస్తూ, తనను ఉద్దేశించి వచ్చే వ్యాఖ్యలకు కౌంటర్లు ఇస్తూ కనిపించారు.



ఆదర్శ కుటుంబం రిలీజ్ వాయిదా..

విక్టరీ వెంకటేష్, శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య బ్రహ్మాజీ నటించిన చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్ రాధాకృష్ణ నిర్మించారు. శ్రీమతి మమతా సమర్పించారు. ఈ సినిమా సాంకేతిక విభాగాల వివరాల్లోకి వెళితే.. మ్యూజిక్: ఎస్ తమన్, సినిమాటోగ్రఫి: రవి కే చంద్రన్, ఎడిటర్: నవీన్ నూలీ, ఆర్ట్ డైరెక్టర్: ఏఎస్ ప్రకాశ్, స్టంట్స్: కెవిన్ కుమార్ తమ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సినిమా అక్టోబర్ 9వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. కానీ ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్టు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఆదర్శ కుటుంబం సినిమా గురించిన సర్‌ప్రైజ్‌లు ఏమీ చెప్పడం లేదు. రాత్రి నుంచి మాపై సోషల్ మీడియాలో వేసుకొంటున్నారు. నాలుగు రోజుల క్రితమే తప్పుకుండా రిలీజ్ అవుతుందని చెప్పాం. కానీ ఆదివారం ఉదయం వరకు 4, లేదా 5 రోజులు ల్యాగ్‌లో ఉన్నాం. అప్పటికీ సినిమా తీసుకు రావొచ్చని అనుకొన్నాం. కానీ ఫ్రైడ్ మార్నింగ్ సినిమా రిలీజ్ అయితే మేము కూడా థియేటర్లోనే చూడాల్సిన పరిస్థితి ఉంది. నిన్న మార్నింగ్ వరకు ఓవర్సీస్ మార్కెట్‌కు కంటెంట్ ఇవ్వలేకపోయాం. అందుకే ఈ సినిమా రిలీజ్ వాయిదా వేయాలని అనుకొంటున్నాం అని నాగవంశీ తెలిపారు. ఈ సినిమాను సేఫ్ ప్రాజెక్టుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ తర్వాత కూడా సినిమా నచ్చుతుందా? లేదా? అనేది వేరే విషయం. ఈ సినిమాలో ఏ ఒక్క సీన్ కూడా వేలెత్తి చూపకుండా, విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుకొన్నాం. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, ధాని వల్ల భయం వల్ల మేము సరైన ప్రాజెక్ట్ ఇవ్వలేకపోతున్నాం అని ఆయన అన్నారు. ఈ సినిమా విషయంలో ముందే జాగ్రత్త పడి ఉంటే.. అక్టోబర్ 9వ తేదీకి వేరే సినిమాలు వచ్చి ఉండేవేమో. అలా చేయలేకపోయినందుకు సారీ. వెంకటేష్ ఫ్యాన్స్ నుంచి పబ్లిసిటీ సరిపోలేదనే ఫిర్యాదు కూడా ఉంది. అలాగే తమన్ బీజీగా ఉండటంతో ట్రైలర్ కూడా రెడీ కాలేదు. నాలుగు రోజుల ముందు సినిమాను వాయిదా వేయడం సరికాదు. ఈ సినిమా విషయంలో ఏ రిస్క్ చేయకుండా.. మంచి సినిమా చూపించాలనే ప్రయత్నంలో భాగంగా ఈ సినిమాను వాయిదా వేయాలని కాల్ తీసుకొన్నాం అని నాగవంశీ అన్నారు. ఇంకా ఈ సినిమా రిలీజ్ ఎప్పుడనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వెంకటేష్ విదేశాలకు వెళ్లారు. ఆయన వచ్చిన తర్వాత సురేష్ బాబుతో కలిసి ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి ఓ నిర్ణయం తీసుకొంటాం. అక్టోబర్ 30 అనే డేట్ విషయంలో ఇంకా ఫిక్స్ కాలేదు అని ఓ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. సినిమా కంటెంట్ మీద నెగిటివిటీ రాకుండా, క్రిటిక్స్ నుంచి ఎలాంటి ట్రోల్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోన్నాం. తప్పు జరగక ముందే అలాంటివి జరగకుండా చూసుకొంటున్నాం. ఓటీటీ వాళ్లకు కూడా రిలీజ్ డేట్ వాయిదాపై రిక్వెస్ట్ చేశాం. త్వరలోనే వారి నుంచి సలహా తీసుకొంటాం. మా టీమ్ అంతా కలిసి చూసి క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాకుండా ఉన్నప్పుడే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని అన్నారు.



అక్టోబర్ 9న హనుమాన్ అంశ్ తెలుగు ట్రైలర్



చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద హిస్టరీ క్రియేట్ చేసిన చిత్రం ' హనుమాన్ అంశ్ '. కేవలం రూ.2కోట్లతో తీసిన హనుమాన్ అంశ్ హిందీలో రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడీ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయింది. అక్టోబర్ 9న థియేటర్లలో రిలీజ్ కానుంది. ప్రచారంలో భాగంగా తాజాగా తెలుగు ట్రైలర్ రిలీజ్ అయింది.ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా 'హనుమాన్ అంశ్' సినిమా తెరకెక్కింది. ఇందులో శోభిత్ శ్రీవాత్సవ ప్రధాన పాత్ర పోషించారు. చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి ఇతర కీలక పాత్రల్లో నటించారు. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలుగులో రిలీజ్ చేయాలని భావించారు. కానీ చివరి నిమిషంలో ఆయన వెనక్కి తగ్గడంతో, ఓవర్ సీస్ లో రిలీజ్ చేసిన హోంబలే ఫిల్మ్స్..ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడానికి ముందుకొచ్చింది. హిందీలో ప్రభంజనం సృష్టించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.